బినామీలే పేదలు..!

జగనన్న లే అవుట్లలో తిష్ట

- పట్టాలు రాసేసుకుని.. విక్రయం..
- జిల్లా వ్యాప్తంగా వైసీపీ నేతల దందా

పుట్టపర్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): అధికారం అండతో ఐదేళ్ల ఆక్రమణలకు పాల్పడ్డారు. ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ పాగా వేశారు. అడిగే వారు ఎవరనే ధీమాతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించారు. జగనన్న లే అవుట్లలో ఖాళీ ప్లాట్లను కూడా ఆక్రమించి సొమ్ము చేసుకున్నారు. పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు మాటున అడ్డగోలుగా దోచుకున్నారు. ప్లాట్ల కేటాయింపు వ్యవహారం, పట్టాల మంజూరు బాధ్యతను అధికారులకు అప్పగించినా.. క్షేత్రస్థాయిలో వైసీపీ నాయకులే అన్నీ చక్కబెట్టారు. జగనన్న లే అవుట్లకు భూ సేకరణ పేరిట రైతులను బెదిరించి.. ఒప్పందాలు చేసుకున్నారు. భూమి యాజమాని కంటే వైసీపీ నాయకులే ఎక్కువగా లాభం పొందరు. మరోవైపు ఊరికి దూరంగా, శ్మశానాల వద్ద ఇళ్ల స్థలాలు కేటాయించి, లబ్ధిదారులను దారుణంగా మోసం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇలా అనేక రకాల అక్రమాలు జరిగాయి. కూటమి అధికారంలోకి రావడంతో వారి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.



బ్రాహ్మణపల్లి వద్ద జగనన్న లేవుట్‌లో వైసీపీ నేతలు ఆక్రమించుకున్న విలువైన ఇళ్ల స్థలాల్లో బేస్‌మెంట్‌లు



పేదల పేరిట దందా

పుట్టపర్తి బ్రాహ్మణపల్లి వద్ద జగనన్న లే అవుట్ల కోసం 113, 143 సర్వే నంబర్లలో 42 ఎకరాల దాకా భూమి కొనుగోలు చేశారు. లే అవుట్‌లో 1,895 ప్లాట్లను ఏర్పాటు చేశారు. ప్రజాప్రయోజనాల కోసం స్థలాల్ని కేటాయించారు. ఇక్కడ రైతుల నుంచి భూముల కొనుగోలు సమయంలో వైసీపీ నేతలు భారీగా వెనుకేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు కొన్ని రోజుల ముందు.. రెండు వందలకుపైగా విలువైన ప్లాట్లను కాజేశారు. దీంతోపాటు ప్రజాప్రయోజనాల కోసం వదలిన స్థలాలను వైసీపీ నేతల అనుచరులు పంచుకుని.. పట్టాలు రాయించుకున్నారు. అక్కడ పునాదులు తవ్వి బేస్‌మెంట్‌లు నిర్మించుకున్నారు. వీటిలో కొన్నింటిని భారీ ధరకు విక్రయించారు. మాజీ ఎమ్మెల్యే అనుచరులందరికీ నియోజకవర్గ వ్యాప్తంగా జగనన్న లే అవుట్లలో పాట్లు ఉన్నాయి. మండల కేంద్రాల్లోని ప్రతి లే అవుట్లలో బీనామీల పేరిట వారు ఇళ్ల స్థలాలు పొందారు. బ్రహ్మణపల్లి లే అవుట్‌లో వైసీపీ నేతలు రూ.లక్షల విలువైన స్థలాల అక్రమాల చిట్టాతో గ్రామస్థులు కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

● కొత్తచెరువు మండల కేంద్రంలోని ధర్మవరం ప్రధాన రహదారి పక్కనే 384, 392, 483 సర్వే నంబర్లలో జగనన్న లే అవుట్లు వేశారు. ఇందులో 1250 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. సర్వే నంబర్ 384లో వందకుపైగా ప్లాట్లలో బీనామీల పేరుతో వైసీపీ నేతలే పాగా వేశారు. ఎన్నికల ముందు వైసీపీ నేతలు రూ.లక్షల విలువైన 24 ప్లాట్లను రాసేసుకున్నారు. ఇలా 200 విలువైన ఇళ్ల స్థలాలను వైసీపీ నేతల అనుచరులు కాజేసి.. అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు.



ఎక్కడ చూసినా కబ్జాలే..

● కదిరి మండలం ఎర్రగుట్టపల్లి వద్ద జగనన్న లే అవుట్‌లో భారీగా అమ్మకాలు జరిగాయి. మున్సిపాలిటీలోని ఓ ప్రజాప్రతినిధి తన అనుచరుల ద్వారా 80 ఇళ్ల స్థలాలను ఒక్కొక్కటి రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షలకు విక్రయించారు. పేదలకు పట్టాల మాటున రూ.కోటికి పైగా కాజేశారు.

● ధర్మవరం-పుట్టపర్తి ప్రధాన రహదారిలోని పోతులనాగేపల్లి వద్ద ఒకటిన్నర సెంటు ప్రకారం 6,246 మందికి జగనన్న ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇక్కడ భూములు ధరలకు రెక్కలు వచ్చాయి. సెంటు ధర రూ.8 లక్షలు పలుకుతోంది. ఇక్కడ వైసీపీ నేతలు దళారుల అవతారమెత్తారు. పేదల ఇళ్ల స్థలాల క్రయ విక్రయాలు చేయించారు. బినామీల పేరుతో భారీగా ఇళ్ల స్థలాలు కొట్టేసి విక్రయించారు. ముద్దిగుబ్బలో 1005, 995, 896 సర్వే నంబర్లలో బినామీల పేరిట వైసీపీ నేతలు ప్లాట్లను కబ్జా చేశారు.

● లేపాక్షి మండలం చోళసముద్రం, హిందూపురం మండలం మణేసముద్రం వద్ద ఏర్పాటు చేసిన లే అవుట్లలో వైసీపీ నేతలు తిష్ట వేశారు. బినామీల పేరిట ఇళ్ల స్థలాలను సొంతం చేసుకున్నారు.



కొత్తచెరువులో ధర్మవరం రహదారి వద్ద జగనన్న లేఅవుట్‌లో వైసీపీ నేతలు ఆక్రమించిన స్థలాలలో పునాదులు, బేస్‌మెంట్‌లు

---

26 మంది తహసీల్దార్లు రిలీవ్

పుట్టపర్తి రూరల్/పుట్టపర్తి, జూలై 27: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన 26 మంది తహసీల్దార్లను సొంత జిల్లాలకు రిలీవ్ చేస్తూ జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు వారు తమ సొంత జిల్లాలైన కర్నూల్, నంద్యాల, చిత్తూరు, వైయస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు బదిలీపై వెళ్లనున్నారు. వారు ఆయా జిల్లా కలెక్టరు కార్యాలయాల్లో రిపోర్టు చేసుకోవాల్సి ఉంది. అదేవిధంగా జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు వారి స్థానాల్లోకి రానున్నారు.

బదిలీ అయిన తహసీల్దార్లు వీరే...

అంజనాదేవి - సోమందేపల్లి, కళావతి - కొత్తచెరువు, వెంకటేశ్వర్లు - అగళి, నజ్మాబాను - తాడిమర్రి, వేణుగోపాల్ - పుట్టపర్తి, వసుంధర - కలెక్టరేట్ (పుట్టపర్తి), శివప్రసాదరెడ్డి - హిందూపురం, శివశంకరనాయక్ - బత్తలపల్లి, రాజేశ్వరి - పరిగి, భారతి - బుక్కపట్నం, వెంకటస్వామి - ఆర్డీఓ కార్యాలయం (పుట్టపర్తి), రామకుమారి - తలుపుల, లక్ష్మీనారాయణ - రొద్దం, వెంకటసుబ్బయ్య - అమరాపురం, బాలనరసింహులు - లేపాక్షి, సరస్వతి - ముదిగుబ్బ, రమేష్ - ధర్మవరం, బద్రుజామా - రొళ్ళ, ప్రతాపరెడ్డి - గుడిబండ, నాగభూషణం - నల్లమాడ, ఉదయ్‌శంకరరాజు - పెనుకొండ, ఖాజాబీ - ఓబుళదేవరచెరువు, పుల్లారెడ్డి - కదిరి, భాగ్యలత - చిలమత్తూరు, శర్వాణి - గాండ్లపెంట, శిరరామన్ - కలెక్టరేట్ (పుట్టపర్తి).

ఎంపీపీ పదవికి ఎసరు..!



టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

- టీడీపీ వశం కానున్న చిలమత్తూరు మండల పరిషత్
- ఒంటెత్తు పోకడే కొంప ముంచిందంటున్న వైసీపీ
- తొమ్మిదికి చేరిన టీడీపీ బలం

హిందూపురం, జూలై 27 : లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి గెలిచి మూడేళ్లవుతున్నా ఎంపీటీసీలు అని చెప్పుకోవడానికి తప్ప ఓటేసిన జనానికి చేసిందేమి లేదు. వైసీపీలో గెలిచిన మూడేళ్లలో అవమానాలు భరించామని, ఇక్కడ ఉండడంకంటే తెలుగుదేశంలోకి వెళ్లడమే నయమని భావించి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మరీ ముఖ్యంగా వైసీపీలో ఆ పార్టీ సామాజిక వర్గానికి చెందిన నాయకులతో నలిగిపోయి టీడీపీలో చేరినట్లు పలువురు ఎంపీటీసీలు పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చిలమత్తూరు మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా మొత్తం వైసీపీ కైవసం చేసుకుంది. అప్పట్లో ఎంపీపీ పదవి కోసం ముగ్గురు పోటీపడ్డారు. ఒక ఎంపీటీసీ భర్తకు మండల కన్వీనర్‌గా, మరో ఇద్దరికి చెరేసి రెండున్నర సంవత్సరాలు ఎంపీపీ పదవి పంచుకుని ఒప్పందం కూడా రాసుకున్నారు. మొదట పురుషోత్తంరెడ్డి ఎంపీపీ అయ్యారు. కానీ, మూడేళ్లు దాటిపోయినా ఆయన పదవి వదులుకోలేదు. దీనికితోడు సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో చిలమత్తూరు మండలపరిషత్ రాజకీయం రసవత్తరంగా మారింది. వైసీపీకి ఊహించని షాక్ తగిలింది. మొత్తం 15 మంది ఎంపీటీసీల్లో దేమకేతేపల్లి ఎంపీటీసీ రాజీనామా చేయగా మిగిలిన 14మంది సార్వత్రిక ఎన్నికలకు ముందు జడ్పీటీసీ అనూషతోపాటు నలగురు ఎంపీటీసీలు టీడీపీలో చేరారు. కూటమి ప్రభుత్వం రావడంతో వైసీపీలోని మిగిలిన ఎంపీటీసీలు మనసు మార్చుకున్నారు. ఈనెల 25న చిలమత్తూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉండగా కోరం లేక వాయిదా పడింది. శనివారం నిర్వహించాలని అధికారులు సిద్ధం కాగా, సభ్యులు రాకపోవడంతో 90రోజులపాటు సమావేశాన్ని వాయిదా వేశారు. ఐదుగురు వైసీపీకి చెందిన ఎంపీటీసీలు, కోఆప్షన్‌మెంబర్ అధికార పార్టీలో చేరారు. దీంతో చిలమత్తూరు మండల రాజకీయం శనివారం వేడెక్కింది.

ఎంపీపీ పదవికి ఎసరు

2021ఎంపీటీసీ ఎన్నికల అనంతరం 15 మంది ఎంపీటీసీల బలంతో పురుషోత్తంరెడ్డి ఎంపీపీగా ఎన్నికయ్యారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు నలుగురు శనివారం మరో ఐదుగురు టీడీపీలో చేరడంతో ఇక ఆ పార్టీ ఎంపీపీ పదవికి ముప్పు వాటిల్లింది. ఎనిమిది మంది ఎంపీటీసీ బలం ఉంటే ఎంపీపీగా కొనసాగవచ్చు. ఉన్న 15 మందిలో ఒకరు రాజీనామా చేయడం 14 మందే ఉండటం, ఇందులో తొమ్మిది మంది టీడీపీలోకి వెళ్లడంతో ఇక ఎంపీపీ పదవి నుంచి దిగిపోక తప్పదు. సాధారణంగా ఎంపీపీగా ఎన్నికైనవారిని నాలుగేళ్లపాటు పదవి నుంచి దించడానికి నిబంధనలు వర్తించవు. కానీ సంఖ్యా బలం లేక పోవడంతో పురుషోత్తంరెడ్డి ఎంపీపీ పదవికి రేపో మాపో రాజీనామా చేయవచ్చని ప్రచారం జరుగుతోంది.

టీడీపీ వశం కానున్న మండలపరిషత్

మండల పరిషత్ ఏర్పడినప్పటి నుంచి చిలమత్తూరు ఎంపీపీగా తెలుగుదేశం పార్టీకి చెందినవారే కొనసాగుతున్నారు. 2021 సంవత్సరంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ సభ్యులే అందరూ గెలవడంతో చిలమత్తూరు మండలపరిషత్ వైసీపీ కైవసమైంది. ఆ పార్టీలో స్థానిక ప్రజాప్రతినిధులకు విలువ ఇవ్వకపోవడం, మూడేళ్లయినా ఒక్కో సభ్యుడు కనీసం రూ.లక్ష అభివృద్ధి పనికూడా చేయకపోవడంతో ఆ పార్టీ సభ్యుల్లో నిస్సహాయత నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఎంపీటీసీలు పార్టీ మారడంతో ఇప్పటి వరకు చిలమత్తూరు మండలపరిషత్ చరిత్రలో లేనివిధంగా మూడున్నరేళ్లకే ఎంపీపీ పదవినుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

తొమ్మిదికి చేరిన టీడీపీ బలం

చిలమత్తూరు మండలం నుంచి 2021లో టీడీపీ తరుపున ఒక్క ఎంపీటీసీ కూడా గెలుపొందలేదు. కానీ శనివారం నాటికి తెలుగుదేశం బలం తొమ్మిదికి చేరింది. ఎంపీపీ పురుషోత్తంరెడ్డితోపాటు నలుగురు మాత్రమే ఆ పార్టీలో మిగిలారు. వీరిలో కూడా మరో ఇద్దరు పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

ఒంటెత్తు పోకడే కొంప ముంచిందంటున్న వైసీపీ

వైసీపీ ఎంపీపీగా ఎన్నికైనప్పటి నుంచి మూడేళ్లుగా మండలంలో ఒంటెత్తు పోకడతో వ్యవహారం సాగుతోంది. ఇక్కడ ఎంపీపీగా ఉన్న వ్యక్తి ఆ పార్టీలో కొంతమంది నాయకులను టీమ్‌గా ఏర్పాటు చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఏ ఒక్క సమావేశంలోనూ మిగిలిన 14మంది సభ్యులను కలుపుకుని నిర్వహించిన దాఖలాలు లేవు. ఆయన వైసీపీ జడ్పీటీసీతోపాటు ఎంపీటీసీలు, సర్పంచులకు వ్యతిరేకంగా వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల వల్లే ఇంతమంది ఎంపీటీసీలు ఉండికూడా నేడు మూడున్నరేళ్లకే ఎంపీపీ పదవిని పోగొట్టుకునే దయనీయం నెలకొందని వైసీపీ నాయకులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

కోతలు.. వేతలు..!

లో ఓల్టేజీతో కాలిపోతున్న మోటార్లు

- రాత్రి కరెంటు పోతే.. చీకట్లో గడపాల్సిందే..
- స్థానికంగా ఉండని విద్యుత్ శాఖ సిబ్బంది
- వినియోగదారుల ఇబ్బందులు పట్టని అధికారులు

తనకల్లు, జూలై 27: విద్యుత్ కోతలు, లో ఓల్టేజీ సమస్యతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ బోరుబావుల మోటార్లు పదే పదే కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఓల్టేజీ తక్కువగా ఉండటంతో పంటలకు సరిగా నీరు పెట్టలేకపోతున్నామని అంటున్నారు. మరోవైపు వేళాపాల లేని విద్యుత్ కోతలతో వినియోగదారులు సతమవుతున్నాయి. తనకల్లు మండలంలో 17 పంచాయతీలు, 174 పల్లెలు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వ గురుకుల పాఠశాల, రైస్ మిల్లులు చాలానే ఉన్నాయి. గృహ, పారిశ్రామిక, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు అందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తనకల్లుకు సమీపం, కొక్కంటిక్రాస్, చీకటిమానుపల్లి, పెద్దపల్లి గ్రామాల వద్ద సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. తనకల్లు, చీకటిమానులిపల్లి సబ్‌స్టేషన్లు ఎప్పటినుంచో ఉన్నాయి. కొత్తగా పెద్దపల్లి, కొక్కంటి క్రాస్‌లో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. నాలుగు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో పనిచేయడానికి రెగ్యులర్ లైన్‌మెన్, కాంట్రాక్టు లైన్‌మెన్‌తోపాటు.. సచివాలయాల్లో పనిచేయడానికి ఎనర్జీ అసిస్టెంట్లును ఏర్పాటు చేశారు. వీరేకాకుండా సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్లను లైన్‌మెన్‌గా గ్రామాలకు పంపారు. మండల వ్యాప్తంగా విద్యుత్ శాఖ సిబ్బందిని పర్యవేక్షించడానికి ఇంజనీరును నియమించారు.

స్థానికంగా లేనందుకే..

విద్యుత్ శాఖ సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల్లో ఉండటం లేదు. ఈంతో రాత్రి సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వినియోగదారులు చీకట్లో మగ్గక తప్పడం లేదు. సిబ్బందిలో చాలామంది కదిరి పట్టణంలో నివసిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తితే.. వారు వచ్చి పరిష్కరించేందుకు గంటల తరబడి సమసయం పడుతోంది. విద్యుత్ సరఫరాను ఎప్పుడు పునరుద్ధరిస్తారో తెలియడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు ఎగిరిపోయినా, వైర్లు తెగిపోయినా రైతులు స్వయంగా మరమ్మతులు చేసుకోవాల్సి వస్తోంది. సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి విద్యుత్ సరఫరా నిలిపివేయించి, మరమ్మతులు చేసుకుంటున్నారు. మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే.. ఉదయం లైన్‌మెన్ వచ్చేదాకా ఆగాల్సిందే. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.



సబ్‌స్టేషన్‌లో కొక్కంటి ఫీడర్



కొక్కంటి క్రాస్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్

ఎప్పుడు వస్తుందో తెలియదు..

కరెంటు ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. బోరు బావి వద్ద రాత్రిళ్లు పడిగాపులు కాయాల్సి వస్తోంది. కరెంటు వచ్చేదాకా జాగారం చేయాల్సి వస్తోంది. కరెంటు వచ్చినా లో ఓల్టేజీ కారణంగా మోటార్లు పనిచేయడం లేదు. సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా స్పందన లేదు. విద్యుత్ సమస్య ఏర్పడితే పరిష్కారానికి సిబ్బందికి పైసలు ఇచ్చుకోవాల్సి వస్తోంది.



\- గంగిశెట్టి, రైతు, కొర్తికోట

తీవ్ర ఇబ్బందులు..

బోరు బావికింద వేరుశనగ పంట సాగుచేశాను. లో ఓల్టేజీ కారణంగా మేము పడుతున్న బాధలు అన్నీ ఇన్నికావు. రాత్రిళ్లు జాగారం చేయాల్సి వస్తోంది. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. సమస్య ఏమిటో తెలుసుకుందామంటే సిబ్బంది అందుబాటులో ఉండటంలేదు.



\- ఈశ్వర్‌రెడ్డి, రైతు, సున్నంపల్లి వారిపల్లి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా..

కొక్కంటి, కొర్తికోట, టి.సదుం ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్య ఉన్నమాట వాస్తవమే. ఇటీవల విద్యుత్ సరఫరాలో అంతరాయలు ఏర్పడుతున్నాయి. సమస్య పరిష్కారం కోసం కొక్కంటిలో నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతున్నాం. సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ సిబ్బంది డబ్బులు అడుగుతున్న విషయం నా దృష్టికి రాలేదు. వినియోగదారులు ఫిర్యాదు చేస్తేచర్యలు తీసుకుంటాం.

\- శ్రీకాంత్, ఏఈ, తనకల్లు

1న మడకశిరకు చంద్రబాబు

- గుండుమలలో సభ నిర్వహించే అవకాశం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



హెలిప్యాడ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్నా కలెక్టర్

మడకశిర, జూలై 27: సీఎం చంద్రబాబు ఆగస్టు ఒకటో తేదీన మడకశిర నియోజకవర్గ పర్యటనకు వస్తున్నారు. మండల పరిధిలోని గుండుమల గ్రామంలో ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని సమాచారం. ఈ నేపథ్యంలో కలెక్టర్ చేతన్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎస్పీ రత్న తదితర అధికారులు శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. గుండుమల గ్రామంలో పర్యటించారు. లబ్ధిదారుల ఎంపికపై చర్చించారు. ముఖ్యమంత్రి బహిరంగ సభ, ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాలకు స్థలాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారైందని, ఏ గ్రామ పరిధిలో పర్యటిస్తారనేది షెడ్యూల్ వచ్చిన తరువాత తెలియజేస్తామని అధికారులు అన్నారు. తహసీల్దారు వెంకటేశులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఆరాధ్య, మాజీ సర్పంచి చంద్రప్ప, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

రూ.2.3 కోట్లతో పెనుకొండ అభివృద్ధి

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



డివైడర్ వద్ద మొక్కలు నాటుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 27: పెనుకొండ పట్టణం రూ.2.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఉన్న డివైడర్ల మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. అనంతరం జూనియర్ కళాశాల మైదానం, దర్గాసర్కిల్ వద్ద అధ్వాన్నంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. పెనుకొండ సుందరీకరణ తమ బాధ్యత అని మంత్రి అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. టౌన్ ప్లాంటేషన్, ఎన్టీఆర్ సర్కిల్ నుంచి షీప్‌ఫారం వరకు, రైల్వే స్టేషన్ నుంచి జాతీయ రహదారి ఎస్కేడీ సర్కిల్ వరకు సెంట్రల్ లైటింగ్, కోనాపురం రైల్వే స్టేషన్ రోడ్డు నిర్మాణానికి వచ్చేనెలలో టెండర్లు పిలుస్తామని తెలిపారు. జూనియర్ కళాశాలలో వాకింగ్ ట్రాక్, క్రీడా మైదానాన్ని సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తామని అన్నారు. పెనుకొండ శానిటేషన్ కార్యక్రమం కోసం రూ.20 లక్షలు వచ్చాయని తెలిపారు.

విన్నవించాలని..



అనంతపురం క్లాక్‌టవర్, జూలై 27: గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు ఉద్యోగ భద్రత కోరుతున్నారు. సచివాలయ ఉద్యోగుల వ్యవస్థకు విధి విధానాలు సూచించకుండా, సర్వీస్ నిబంధనలు అమలు చేయకుండా, జాబ్‌చార్ట్ లేకుండా, ప్రమోషన్లు లేకుండా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఉద్యోగులు వాపోతున్నారు. అత్యున్నత విద్యనభ్యసించి, రూ.లక్షల్లో జీతాలు వదులుకుని ప్రభుత్వ ఉద్యోగమన్న ఆశతో వచ్చిన అనేకమంది గత ప్రభుత్వ వైఖరితో గందరగోళంలో పడిపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.27 లక్షల మంది గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు ఉండగా, ఉమ్మడి జిల్లాలో సుమారు 10వేల మంది వరకు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వంలో అనేక అవమానాలు, భౌతికదాడుల కు సైతం ఎదురొడ్డి నిలబడ్డారు. కొత్త ప్రభుత్వానికి తమ సమస్యలు విన్నవించి పరిష్కరించుకుంటామనే ఆత్మవిశ్వాసంతో సచివాలయ ఉద్యోగులు ఏకమయ్యారు. అందుకు వేదికగా అనంతపురంను చేసుకున్నారు. ఈక్రమంలోనే జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించతలపెట్టిన గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల సదస్సును ఉపయోగించుకోనున్నారు. తాము భజనతో కాదు బాధ్యతతో, పార్టీలతో కాదు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామనే నినాదంతో ముందుకెళ్తున్నట్లు ఉద్యోగులు పేర్కొన్నారు.

ఏకమైన సచివాలయ ఉద్యోగులు
నియామక విధానంపై ఆందోళన
సమస్యల పరిష్కారం కోసం వేడుకోలు
కొత్త ప్రభుత్వ చల్లని చూపుకోసం రాష్ట్ర సదస్సు

నేడు గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు

ఏపీ గ్రామ-వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్రస్థాయి సదస్సు ఆదివారం జిల్లా కేంద్రంలోని పాతూరులోని పద్మావతి ఫంక్షన్‌హాల్ (రమణ రమేష్ థియేటర్)లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి వీకే లక్ష్మీనారాయణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 26జిల్లాల నుంచి సుమారు 4వేల మంది సచివాలయ ఉద్యోగులు హాజరయ్యే సదస్సుకు ముఖ్య అతిథులుగా ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఐక్యవేదిక ఛైర్మన్ సూర్యనారాయణ, గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్‌లతో పాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు.

నియామకమే సక్రమంగా లేదు



గత ప్రభుత్వంలో ఉన్నత విద్యావంతులు సైతం పోటీ పరీక్ష ద్వారా గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు గా నియామకం పొందాం. అయితే సచివాలయ ఉద్యోగుల వ్యవస్థకు ఎటువంటి విధివిధానాలు సూచించకుండా, సర్వీస్ నిబంధనలు అమలు చేయకుండా, పదోన్నతులు లేకుండా ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోవాల్సిన పరిస్థితి. ఏపీపీఎస్సీ ద్వారా నియామకం చేపట్టకుండా, సుదీర్ఘ ఆలోచన లేకుండా తాత్కాలిక ఆలోచనతో గత ప్రభుత్వం మమ్మల్ని బలిచేసింది. సచివాలయాల్లో పనిచేస్తున్న 11వివిధ శాఖల ఉద్యోగుల సమస్యలపై ఉన్నత స్థాయి అధికారులతో 90రోజుల వ్యవధితో కమిటీ వేసి, పరిష్కరించాలి.

వీకే.లక్ష్మీనారాయణ, గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి.

గుర్తింపు లేదు



ఉద్యోగంలో ఉన్నా మాకు ప్రజల్లో గుర్తింపు లేదు. మాకు ఉద్యోగం చేస్తున్నామన్న ఆత్మ సంతృప్తి లేదు. ప్రత్యేక విధి విధానాలు వర్తింప చేయాలి. అప్పుడే ఉద్యోగానికి సార్థకత లభిస్తుంది. సచివాలయ ఉద్యోగులకు ఇన్‌చార్జిలుగా ఉన్న వారికి ఎఫ్‌ఏసీ ఇచ్చి అదనపు వేతనం చెల్లించాలి. బీఎల్‌ఓలుగా పనిచేసిన సచివాలయ ఉద్యోగులకు అందాల్సిన గౌరవ వేతనం బకాయిలు ఇవ్వాలి. సచివాలయ ఉద్యోగులను ఆయా మాతృశాఖలలో విలీనం చేయాలి. ఇందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు ప్రారంభించాలి.

- శివశంకర్, సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినప్పుడే మాకు న్యాయం జరుగుతుంది. ప్రజలతో మమేకమై శ్రమిస్తున్న మా వాయిస్ ప్రభుత్వానికి వినిపించాలి. జాబ్‌చార్ట్ లేకుండా, పదోన్నతులు లేకుండా మానసికంగా కుంగిపోతున్నాం. మొదట గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగభద్రత కల్పించాలి.

- సాకే రామాంజనేయులు, మౌలిక వసతులు కల్పన కార్యదర్శి.

మేస్త్రీల కింద పని చేయాల్సిన స్థితి



ఉన్నత విద్యనభ్యసించినా మున్సిపాలిటీలలో మేస్త్రీల కింద పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మున్సిపాలిటీలలో, పంచాయతీలలో మాతో అన్ని పనులు చేయిస్తున్నారు. అయితే ప్రాధాన్యమైన జనన, మరణ, వివాహ సర్టిఫికెట్ల జారీ మాత్రం మాకు ఇవ్వకుండా కించపరిచారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తున్న రూల్స్ అన్నీ కూడా సచివాలయ ఉద్యోగులకు వర్తించేలా చూడాలి. ప్రతి సారి కిందిస్థాయి అధికారులు సచివాలయ ఉద్యోగులను ప్రత్యేక జీఓలు, సర్క్యులర్లు అడగకుండా కంట్రోల్ చేయాలి.

- హనుమంతు, సచివాలయ ఉద్యోగి.

మొత్తం గేట్లు ఎత్తేశారు

తుంగభద్రకు కొనసాగుతున్న వరద



బయటకు వెళ్తున్న వరద జలాలు

బొమ్మనహాళ్, జూలై 27: తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తడంతో మొత్తం 33 క్రస్ట్ గేట్ల (25 గేట్లు మూడున్నర అడుగులు, మరో 8 గేట్లు ఒక్క అడుగు మేర)ను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. 1,41,485 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదికి, 8,895 క్యూసెక్కులను కాలువలకు విడుదల చేశారు. డ్యాం ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగుతుండటంతో ఆ వరదనీరు డ్యాంలోకి వచ్చి చేరుతోంది. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 1,10,943 క్యూసెక్కులుండగా ఔట్ ఫ్లో కాలువలకు వదిలే నీటితో కలిపి 1,50,500 క్యూసెక్కులు ఉంది. డ్యాం కెపాసిటీ 1633 అడుగులతో 100.054 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగిలిన నీటిని బోర్డు అధికారులు దిగువకు వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కి.మీ. వద్ద 753 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

ఉజ్వల భవితకు పునాదులు వేసుకోండి

- ఏపీఎస్‌సీహెచ్‌ఈ మాజీ ఛైర్మన్ హేమచంద్రారెడ్డి



మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి

బుక్కరాయసముద్రం, జూలై 27: కళాశాలలో గడిపే నాలుగు సంవత్సరాలు ప్రతి విషయం చక్కగా నేర్చుకుని ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదేనని ఏపీఎస్‌సీహెచ్‌ఈ మాజీ ఛైర్మన్ హేమచంద్రారెడ్డి అన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎస్ఆర్ఐటీలో చేరిన విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆరంభ్-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి యాజమాన్యం, సిబ్బంది అందించే అన్ని అవకాశాలను చక్కగా ఉపయోగించుకోవాలన్నారు. బలాలు, బలహీనతలు అధిగమించి, సమస్యలను ఎదుర్కొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ సాంబశివారెడ్డి, ఎస్ఆర్ఐటీ సలహాదారు చక్రవర్తి, కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, డీన్ సాయిచైతన్య కిషోర్, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈ ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన హౌసింగ్ ఏఈ బాలాజీ

ధర్మవరం, జూలై 27: అధికారుల వేధింపులు తాళలేక స్థానిక మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఏఈ అన్నంబాలాజీ ఆత్మహత్యకు యత్నించాడు. హౌసింగ్ కార్యాలయానికి శనివారం వెళ్లిన ఆయన అందరూ చూస్తుండగానే తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. తోటి ఉద్యోగులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హౌసింగ్ ఏఈ భార్య వనిత మాట్లాడుతూ..హౌసింగ్ పీడీ, డీఈ, మరో కిందిస్థాయి ఉద్యోగి వీరు ముగ్గురూ తరచూ వేధించేవారన్నారు. రెండు నెలల కిందట ఏకారణం లేకుండానే సస్పెండ్ చేశారన్నారు. కారణం అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారన్నారు. తన భర్తపై సస్పెన్షన్ తొలగించి, మళ్లీ ఉద్యోగంలోకి తీసుకోవడానికి హౌసింగ్ అధికారులు భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త రెండునెలల నుంచి అధికారుల వేధింపులతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడని తెలిపారు. ఈక్రమంలోనే అఘాయిత్యానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై మంత్రులు నారాలోకేశ్, సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరుతానని ఆమె పేర్కొన్నారు. తన భర్త ఆత్మహత్యాయత్నానికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు.

ఖైదీలను ఆసుపత్రికి తీసుకెళ్లండి



ఖైదీతో మాట్లాడుతున్న జడ్జి శివప్రసాద్

అనంతపురం క్రైం,జూలై 27: ఖైదీలు అనారోగ్యంగా ఉంటే మందులివ్వాలని, అవసరమైతే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తీసుకెళ్లాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి శివప్రసాద్ సూచించారు. ఆయన శనివారం జిల్లా జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి, జైలులో అందుతున్న సౌకర్యాలు, ఆహారం, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నా రు. ఖైదీలకు న్యాయ సేవల లభ్యత, అప్పీల్ హక్కు, అభ్యర్థన బేరసారాలు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ పనితీరు గురించి తెలియజేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ పొందిన ఖైదీలకు సర్టిఫికెట్లు జారీ చేశారు. అంతకుముందు నగరంలోని అబ్జర్వేషన్ హోమ్ ఫర్ బాయ్స్ కేంద్రాన్ని సందర్శించి సౌకర్యాలు, వారి కేసు దశ, చట్టంతో బాలల సంఘర్షణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రెహమాన్, నాబార్డ్ డీడీఎం అనురాధ, స్త్రీ శక్తి సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మహేశ్వరి, కెనరాబ్యాంకు మేనేజర్ సెంథిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్‌కు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, జూలై 27: శ్రీసత్యసాయి జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)సెక్రటరీ అండర్-14, 17 నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు ఈ పోస్టులకు అర్హుల న్నారు. రెండేళ్లలోపు రిటైర్ అయ్యేవారు ఈ పోస్టుకు అనర్హులని, గతంలో ఎస్‌జీఎఫ్ సెక్రటీగా పనిచేసిన వారు అనర్హులని వెల్లడించారు. దరఖాస్తులను ఈ నెల 30లోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని డీఈఓ సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ...

కొత్తచెరువు, జూలై 27: శ్రీసత్యసాయిజిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్ ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ మీనాక్షి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆగస్టు 5లోగా మండల విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారికి అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు కనీసం 15 సంవత్సరాలు బోధనా అనుభవం కల్గిఉండాలి. రాష్ట్రస్థాయికి దరఖాస్తు చేసుకునే వారు గతంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉండాలి. దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులపై ఎటువంటి క్రిమినల్ కేసులు, ఆర్టికల్ ఆఫ్ చార్జెస్, శాఖ పరమైన క్రమశిక్షణ చర్యలు ఉండరాదు. జాతీయ అవార్డుకు దరఖాస్తు చేసుకునే వారు అనర్హులు.

ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు ...

అంతపురం సెంట్రల్, జూలై 27: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మ్యాథమేటిక్స్ ఫిజిక్స్ ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో కనీసం 50శాతం మార్కులు, మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా, తత్సమాన విద్యార్హతలు కలిగిన యువతీ, యువకులు అర్హులన్నారు. http-s://agnipathvayucdac.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. వివరాలకు 08554 245547 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పాముకాటుతో విద్యార్థి మృతి



దాసరి జోషి ఫైల్‌ఫొటో

కణేకల్లు, జూలై 27: మండలంలోని గెణిగెర గ్రామానికి చెందిన భీమలింగ, శాంతి దంపతుల కుమారుడైన దాసరి జోషి(8) పాముకాటుతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న జోషి శుక్రవారం రాత్రి తల్లిదండ్రులతో పాటు తమ ఇంట్లో నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ఏదో కుట్టిందని, నొప్పిగా ఉందని బాలుడి లేచి తల్లిదండ్రులకు తెలిపాడు. దీంతో వారు వెంటనే ఇల్లంతా పరిశీలించారు. పాము కనపడటంతో దాన్ని చంపి, జోషిని కణేకల్లు క్రాసింగ్‌లోని ఆర్టీటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

విద్యుత్ తీగ తెగిపడి వ్యక్తి మృతి

● మడకశిర సమీపంలో ప్రమాదం



విద్యుత్ తీగ తెగిపడి మృతి చెందిన పెన్నోబులేసు
ఇన్‌సెట్‌లో రోదిస్తున్న భార్య

మడకశిర టౌన్, జూలై 27: పట్టణ సమీపంలో విద్యుత్ తీగ తెగి మీద పడటంతో పెనుకొండ పట్టణానికి చెందిన పెన్నోబులేసు(38) అనే వ్యక్తి మృతిచెందాడు. యాదవ కల్యాణ మండపం సమీపంలో శనివారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. 11 కేవీ లైన్ వైర్లు చింత చెట్లపై పడుతుండటంతో ప్రమాద నివారణ కోసం విద్యుత్ శాఖ అధికారులు ఇన్సులేటర్‌ను అమర్చారు. బలమైన గాలులు వీయడంతో శనివారం చింతకొమ్మలు తగిలి ఇన్సులేటర్ పగిలి.. విద్యుత్ తీగ తెగిపోయింది. అదే సమయంలో బైక్ మీద వెళుతున్న పెన్నోబులేసుపై ఆ తీగ పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు. గతంలో ఇదే లైన్‌పై తీగలు రాసుకుని మంటలు ఎగసిపడ్డాయి. ఫైర్ సిబ్బంది వచ్చి ఆర్పివేయాల్సి వచ్చింది. ఆ తరువాత కొన్నాళ్లకే విద్యుత్ తీగ తెగిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇలా పదే పదే తీగలు తెగిపోతున్నా విద్యుత్ శాఖ అధికారులు గట్టి చర్యలు తీసుకోలేదు. వారి నిర్లక్ష్యం కారణంగానే ఓ ప్రాణం పోయిందని పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య సుమలత, ఇద్దరుకుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గతంలో చింతచెట్టు కొమ్మలను నరికివేసేందుకు తమ సిబ్బంది ప్రయత్నించారని,చెట్టు యజమాని అడ్డుకోవడంతో ఇన్సులేటర్‌ను ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ ఏడీ సుబ్రహ్మణ్య ప్రసాద్ పేర్కొన్నారు.

అసెంబ్లీకి రాలేక మొహం చాటేసిన జగన్: మంత్రి సవిత



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 27: ప్రజా సమస్యలపై పోరాటం చేయకుండా, అసెంబ్లీకి రాలేక పులివెందుల ఎమ్మెల్యే జగన్ మొహం చాటేస్తున్నారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో శనివారం ఆమె పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి, స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తారన్న నమ్మకంతో ఎన్‌డీఏ కూటమికి ప్రజలు సంపూర్ణ మెజారిటీతో అధికారం ఇచ్చారని అన్నారు. కక్షసాధింపు చర్యలకు వెళ్లకుండా, అభివృద్ధి బాటలో వెళ్లాలని, ప్రజలకు ఏం కావాలో వారి వద్దకు వెళ్లి తెలుసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే తమకు దిశానిర్దేశం చేశారని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో 36 హత్యలు జరిగాయని జగన్ అంటున్నారని, వాటికి సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను తీసుకురావాలని ఇప్పటికే హోం మంత్రి ఓపెన్ ఛాలెంజ్ చేశారని అన్నారు. ఎఫ్ఐఆర్ కాపీ తీసుకు రమ్మంటే.. జగన్ అసెంబ్లీకి రావడం లేదని అన్నారు. ప్రజల కోసం పోరాటం చేయకుండా ఢిల్లీలో నిరసన తెలిపితే సమస్యలు పరిష్కారం అవుతాయా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో అన్ని శాఖలలో అవినీతి జరిగిందని, తోడేకొద్దీ బయటకు వస్తోందన్నారు. రాష్ట్రంలో అప్పులు రూ.కోట్లలో పేరుకుపోయాయని అన్నారు.

అవార్డులు అందుకున్న భరత్, జీవన్



కేంద్ర మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న బిసాటి భరత్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 27: కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, డిజిటల్ ఇండియా విభాగం మై గవర్నమెంట్ అంబాజిడర్, సాతీ అవార్డులను జిల్లాకు చెందిన బిసాటి భరత్, జీవన్ కుమార్ అందుకున్నారు. ఢిల్లీలో కేంద్ర ఐటీ శాఖ మంత్రి జితిన్‌ప్రసాద్ చేతుల మీదుగా శనివారం వీరు ఈ అవార్డులను అందుకున్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ప్రధానమంత్రి బీమా యోజన, క్యాష్‌లెస్ ఇండియా, డిజిలాకర్, ఉమంగ్ యాప్ ఆత్మనిర్భర్ భారత్, మేరీ మిట్టి మేరా దేశ్, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వంటి కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను గత పదేళ్లుగా ప్రజల్లోకి తీసుకెళ్లినందుకుగాను వీరికి అవార్డులు అందజేశారు.



అవార్డు అందుకుంటున్న జీవన్‌కుమార్

ఎంఫార్మసీ ఫలితాలు విడుదల

అంతపురం సెంట్రల్, జూలై 27: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంఫార్మసీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. మే, జూన్‌లో ఎంఫార్మసీ నాలుగో సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. నాలుగో సెమిస్టర్(ఆర్17) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు మంత్రి సత్యకుమార్ రాక

అంతపురం సెంట్రల్/ధర్మవరం, జూలై 27: రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదివారం ఉమ్మడి జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు బీజేపీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ధర్మవరంలోని సీబీఎస్ ఫంక్షన్ హాల్ లో ప్రజాసమస్యలపై సమావేశం, 5గంటలకు చేనేత కార్మికుల సమస్యలపై సమావేశం, 6గంటలకు వ్యాపారులతో సమావేశాలు ఉంటాయని నాయకులు పేర్కొన్నారు. అలాగే ఉదయం అనంతపురంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంట్ పరీక్షలు

అనంతపురం టౌన్, జూలై 27: డిపార్ట్‌మెంట్ పరీక్షలు ఆదివారం నుంచి జరుగుతాయని కలెక్టరు వినోద్‌కుమార్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి శనివారం తెలిపారు. ఇందుకోసం నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే ఈ పరీక్షలు ఉదయం 10గంటల నుంచి 12వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5వరకు జరుగుతాయన్నారు. థియరీ టైపు పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి 6 గంటల వరకు ఉంటాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు 15 నిమిషాలు ముందే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలు తీసుకురాకూడదన్నారు. పెన్సిల్, హాల్‌టికెట్,తోపాటు ప్రభుత్వం గుర్తించిన ఏదైనా కార్డు తీసుకొని హాజరుకావాలన్నారు.

ఇళ్ల వద్దకే పింఛన్

● ఆగస్టులో మొత్తం రూ.126 కోట్ల పంపిణీ



అనంతపురం క్లాక్‌టవర్, జూలై 27: ఇళ్ల వద్దకే ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత నెలలో పంపిణీ చేసిన తరహాలోనే ఆగస్టు నెలలోనూ లబ్ధిదారుల ఇంటివద్దనే అందజేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్ ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి రోజే 99శాతం పంపిణీ పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ ఇంటి వద్దనే అందజేయనున్నారు. లబ్ధిదారులు ఎవరూ సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేయాలని, అదనంగా పంపిణీకి సమయం ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఈనెల 31న గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు బ్యాంకుల నుంచి నగదు మొత్తాన్ని డ్రా చేసి సిద్ధంగా భద్రపరుచుకోవాలన్నారు. పంపిణీ చేసి మిగిలిన మొత్తాన్ని రెండు రోజుల్లోపు సెర్ప్‌కు తిరిగి చెల్లించాలని సూచించారు. చెల్లించని పింఛన్లన్నింటికీ కారణా లు ఆయా గ్రామ-వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లు 5లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో 2,87,656మంది పింఛన్‌దారులకు రూ.126కోట్లు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు నెలకు సంబంధించి మొత్తాన్ని విడుదల చేసింది. ఇందులో వృద్ధులు 1,42,954 మందికి రూ.57.18కోట్లు, వితంతువులు 66,616మందికి రూ.26.64కోట్లు, చేనేత లు 6,697మందికి రూ.2.67కోట్లు, కల్లుగీత కార్మికులు 354మందికి రూ.14.2 లక్షలు, మత్స్యకారులు 887మందికి రూ.35.5లక్షలు, ఒంటరి మహిళలు 6,717 మందికి రూ.2.68కోట్లు, సఫాయి కర్మాచారులు 3,506మందికి రూ.1.40కోట్లు, హిజ్రాలు 207మందికి రూ.83వేలు, హెచ్‌ఐవీ బాధితులు 2,437మందికి రూ.97.5లక్షలు, డప్పు కళాకారులు 3,129మందికి రూ.1.25కోట్లు, కళాకారులు 182మందికి రూ.73వేలు, అభయ హస్తం 4,233మందికి రూ.2.12లక్షలు, దివ్యాంగులు 46,242మందికి రూ.27.74కోట్లు, కుష్టు వ్యాధి బాధితులు 387మందికి రూ.23లక్షలు, మంచానికే పరిమితమైన బాధితులు 1,440మందికి రూ.1.63 కోట్లు, ప్రమాద బాధితులు 1089మందికి రూ.1.63కోట్లు ఇతరత్రా బాధితులకు కలిపి మొత్తం 2,87,656మందికి రూ.126కోట్లు ఆగస్టులో పంపిణీ చేయనున్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఇంటివద్దకే పింఛన్‌లు పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ ఓబుళమ్మ తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామ, వార్డు సచివాలయాలకు నిధులు విడుదల చేశామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ఆయా మండల ఎంపీడీఓలు, మున్సిపాలిటీలలో ఆయా కమిషనర్లు పంపిణీ బాధ్యతను పర్యవేక్షిస్తారని తెలిపారు.

జిల్లాలో తేలికపాటి జల్లులు

పుట్టపర్తి రూరల్, జూలై 27: జిల్లాలో శుక్రవారం రాత్రి అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు పేర్కొన్నారు. మడకశిరలో అత్యధికంగా 7.2 మిమీ, తాడిమర్రిలో అత్యల్పంగా 1.4 మిమీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. అలాగే గుడిబండలో 5.8 మి.మీ., ఓబుళదేవరచెరువు 5.4, బత్తలపల్లి 4.4, నంబులపూల కుంట 4.4, నల్లమాడ 4.4, రొళ్ళ 4.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. గాండ్లపెంటలో 3.8 మి.మీ., ముదిగుబ్బ 3.2, నల్లచెరువు 3.0, తలుపుల 2.4, కదిరి 2.4, కొత్తచెరువు 2.2, తాడిమర్రి 1.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖాధికారులు తెలియజేశారు.

ఘనంగా మండల పూజ

ఓబుళదేవరచెరువు, జూలై 27: మండలంలోని ఎం కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయంలో శనివారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మండల పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో పురోహితులు పంచరత్న సురేష్ శర్మ, పచ్చర్ల ఆంజనేయులనాయుడు వేదమంత్రోచ్చారణ నడుమ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. రెండు నెలల క్రితం దేవస్థానం ఆవరణంలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ దంపతుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా శనివారం 41వ రోజు మండల పూజ చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

శ్రావణమాసోత్సవ పోస్టర్ల విడుదల

నల్లచెరువు, జూలై 27: పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను శనివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమం ఆలయ ఇఓ రవీంద్రరాజు అధ్యక్షతన చేపట్టారు. ముఖ్య అతిథులుగా టీడీపీ మండల కన్వీనర్ పీ రాజశేఖర్, వై అంజనప్ప, నాగభూషణంనాయుడు, అశ్వత్థనాయుడు, కిరణ్‌కుమార్‌నాయుడు, గోవిందు, లక్ష్మీనారాయణ, ప్రసాద్, సూరి హాజరయ్యారు. ఈఓ మాట్లాడుతూ శ్రావణ మాసోత్సవాలు ఆగస్టు 10న ప్రారంభమై 31వతేదీన ముగుస్తాయన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రతి శనివారం నిర్వహించనున్నట్లు చెప్పారు. శ్రావణమాసంలో ప్రతి శని, మంగళవారాల్లో ప్రత్యేక పూజలుంటాయన్నారు.

'అనుమతి లేని ప్రథమచికిత్స కేంద్రాలను మూసివేయాలి'

తనకల్లు, జూలై 27: మండలపరిధిలోని కొక్కంటి క్రాస్‌లో శనివారం ప్రథమచికిత్స కేంద్రాలను (ఆర్‌ఎంపీ) కొక్కంటి వైద్యాధికారి లోకేశ్వర్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి ఆస్మిక పరిశీలన చేశారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాలతో పరిశీలిస్తున్నామన్నారు. కొక్కంటి క్రాస్‌లో తొమ్మిది మంది ఎలాంటి అనుమతులు లేకుండా ప్రథమచికిత్స కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ అనుమతులు లేని ప్రథమచికిత్స కేంద్రాలను మూసివేయాలని, వాటి నిర్వాహకులకు తెలిపినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా కేంద్రాలను తెరచి చికిత్సలు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతోపాటు ఎంపీ హెచ్ఈఓ ఓబులేశు, మోహన్‌రెడ్డి, తదితరులున్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి



విద్యార్థులకు నోట్‌పుస్తకాలను అందజేస్తున్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి

ధర్మవరం, జూలై 27: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తేనే ఉన్నతశిఖరాలను అధిరోహించగలరని ప్రభుత్వబాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి సూచించారు. ప్రభుత్వం జూనియర్ కళాశాలకు సరఫరా చేసిన నోట్‌పుస్తకాలు, బ్యాగులను శనివారం కళాశాల ఆవరణంలో ప్రిన్సిపాల్ విద్యార్థులకు పంపిణీచేసి, మాట్లాడారు. గతంలో ఎన్నడూలేని విధంగా నోట్ పుస్తకాలు, బ్యాగులను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తంచేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

తండాల్లో ఉచిత ఆయుర్వేద శిబిరం

కదిరిఅర్బన్, జూలై 27: మండలంలోని ఎర్రదొడ్డి పంచాయతీలోని బొడేనాయక్‌తండా, మీటేనాయక్‌తండా, రామదాసునాయక్ తండాల్లో శనివారం ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహించారు. డాక్టర్ సులేమాన్ హాజరై వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈశిబిరంలో దాదాపు 200 మందికిపైగా చికిత్సలు చేయించుకున్నట్లు డాక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో 104 సిబ్బంది, టీడీపీ నాయకుడు ఈశ్వర్‌నాయక్, ఓంకార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

కదిరి(అమడగూరు), జూలై 27: అమడగూరు మండలకేంద్రంలోని చౌడేశ్వరీ కల్యాణమండపంలో శనివారం అమడగూరు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దొడ్డం అశోక్ మాట్లాడుతూ... ఈ శిబిరంలో 68మంది రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. కదిరి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు శిబిరానికి హాజరై రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు రామాంజి, శివ, సులేమాన్, నాగార్జున, బషీర్, పవన్, జూనియర్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

కొత్తచెరువు, జూలై 27: ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల విషజ్వరాలు ప్రబలుతున్నాయని బండ్లపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున దోమలు వృద్ధి చెంది జ్వరాలు సోకుతున్నాయన్నారు. దీంతో దోమల నివారణకు శని వారం బండపల్లి, భైరాపురం పంచాయతీ కేంద్రాల్లో ఫాగింగ్‌చేశామని ఆయన తెలిపారు.

లాంగ్‌జంప్‌లో ఓడీసీ విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని గౌతమి

ఓబుళదేవరచెరువు, జూలై 27: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని ఎం గౌతమి అండర్ - 14 లాంగ్‌జప్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. నల్లమాడలో శనివారం నిర్వహించిన గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో భాగం లాంగ్‌జప్‌లో పాల్గొని రెండో స్థానం సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు గోపీనాథ్ తెలిపారు. అనంతపురంలో ఆగస్టులో జరిగే క్రీడాపోటీల్లో గౌతమి పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

హిమాచల్ భక్తుల పర్తియాత్ర



పాటలు పాడుతున్న హిమాచల్ ప్రదేశ్ భక్తులు

పుట్టపర్తి, జూలై 27: హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన 500 మంది భక్తులు శనివారం పర్తియాత్ర పేరుతో ప్రశాంతినిలయం చేరుకున్నారు. సాయికుల్వంత్ సభా మండపంలో సాయంత్రం భక్తిగీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే బాలవికాస్ విద్యార్థులు శివపురాణం, మహాభారతంలోని భక్తి పాటలకు నృత్యప్రదర్శన చేశారు. గంటపాటు సంగీతం, నృత్యాలతో అలరించారు. హిమాచల్ ప్రదేశ్‌లో నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాల గురించి ఆ రాష్ట్ర సేవా సంస్థల అధ్యక్షుడు యోగీంద్రవర్మ వివరించారు. అనంతరం వారు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

టీడీపీ నాయకుల వార్డ్ వాచ్



29వ సచివాలయంలో ఆధార్ అప్‌డేట్‌ను పరిశీలిస్తున్న నాయకులు

ధర్మవరం, జూలై 27: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు శనివారం పట్టణంలోని 29, 30 వా ర్డులలో వార్డ్ వాచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు, 29,30 వార్డుల కో ఆర్డినేటర్ కేశగాళ్ల శ్రీనివాసులు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి వార్డులో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే 29వ వార్డులో సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్‌అప్‌డేట్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆ వార్డులో కంపచెట్ల మధ్యలో విద్యుత్‌తీగలు ఉండటం గమనించి ట్రాన్స్‌కో అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సదానందా, గోపాల్, దుర్గేశ్, చెన్నప్ప, ఖాసిం, నారాయణస్వామి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నాగమణి

ఓబుళదేవరచెరువు, జూలై 27: మండలంలోని వీరప్పగారిపల్లికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విధుల నుంచి తొలగించాలని కొంతమంది గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మనస్తాపం చెందిన ఆమె తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వీడియో సోషల్ మీడియాలో పెట్టింది. అది బాగా వైరల్ అయ్యింది. పురుగులమందు తాగి, అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను బంధువులు 108 వాహనంలో కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కారకులపై చర్యలు తీసుకోవాలి

అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, యూనియన్ ప్రాజెక్టు నాయకులు ఆశీర్వాదమ్మ, రంగమ్మ మాట్లాడుతూ... అంగన్‌వాడీ కార్యకర్త నాగమణిని వేధించిన టీడీపీ నాయకుడు ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ ఖాజాబీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడనుంచి ర్యాలీగా నినాదాలు చేస్తూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్‌కు, ఎస్ఐ వంశీకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. యూనియన్ నాయకురాళ్లు కమలమ్మ, సీఐటీయూ నాయకులు కుళ్లాయప్ప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలి

కదిరి అర్బన్: అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు పేర్కొన్నారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి తనను తొలగిస్తారన్న ఆవేదనతో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. కదిరి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను సీఐటీయూ నాయకులు పరామర్శించారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజల భాగస్వామ్యంతోనే అటవీ సంరక్షణ సాధ్యం

తనకల్లు, జూలై 27: ప్రజల భాగస్వామ్యంతోనే అటవీ సంరక్షణ, అడవి జంతువుల సంరక్షణ సాధ్యమవుతుందని జన జాగృతి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాంప్రసాద్ పేర్కొన్నారు. ఆయన శనివారం మండలంలోని రాచినేపల్లిలో అటవీ సంరక్షణపై ప్రజలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం అడవులను పరిశీలించారు. అడవిలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయనతోపాటు సర్పంచ్ రెడ్డెప్పనాయుడు, జనజాగృతి సిబ్బంది చంద్రమోహన్, గరుడప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడి సేవలో ఉప లోకాయుక్త చైర్మన్



ఉపలోకాయుక్త చైర్మన్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

కదిరిలీగల్, జూలై 27: కదిరి లక్ష్మీనరసింహస్వామిని కర్ణాటక ఉప లోకాయుక్త చైర్మన్ జస్టిస్ బీ వీరప్ప దంపతులు శనివారం దర్శించుకున్నారు. వారికి సహాయ కమిషనర్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారు శ్రీవారిని దర్శించుకున్న అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు చేసి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జాతి గర్వించదగ్గ మహనీయుడు అబ్దుల్‌కలాం



పుట్టపర్తిలో అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న కూటమినాయకులు


పుట్టపర్తి/ధర్మవరం/ నంబుల పూలకుంట/ నల్లమాడ, జూలై 27: మిసైల్ రూపకర్త, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జీవితం స్ఫూర్తిదాయకమని ఎన్డీఏ కూటమి నాయకులు కొనియాడారు. వారు శనివారం పట్టణంలో అబ్దుల్‌కలాం తొమ్మిదో వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. అలాగే ధర్మవరంలో బీజేపీ నాయకుడు రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అబ్దుల్‌కలాం విగ్రహానికి శనివారం కార్యకర్తలతో కలిసి పూలమాల వేసినివాళులర్పించారు. నంబులపూలకుంట మండలంలోని తూర్పునడింపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నల్లమాడ మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని టీడీపీ నాయకుడు బుట్టి నాగభూషణనాయుడు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు



గాండ్లపెంటలో విజేతలతో ఉపాధ్యాయులు

గాండ్లపెంట, జూలై 27: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల మైదానంలో బాలికలకు ఆర్డీటీ ఆధ్వర్యంలో శనివారం క్రీడాపోటీలు నిర్వహించారు. గాండ్లపెంట, కటారుపల్లి, కేజీబీవీ, రెక్కమాను, ఎస్సీకుంట మండలంలోని గూటిబైలు పాఠశాలల విద్యార్థినులకు లాంగ్‌జప్, షాట్‌పుట్, పరుగుపందె పోటీలు నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, ఎస్ఐ క్రిష్ణవేణి హాజరయ్యారు. విజేతలను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. వారికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు.



గెలుపొందిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

నల్లమాడ, జూలై 27: మండలంలోని ఆర్ రామాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో బాలికలకు రూరల్ అథెల్‌టిక్స్ క్రీడా పోటీలో శనివారం నిర్వహించారు. ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ హాజరయ్యారు. ఈ పోటీల్లో నల్లమాడ, ఓడీసీ మండలాల ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలికలు పాల్గొన్నారు. మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ప్రతిభకనబరచిన బాలికలకు ప్రశంసాపత్రం, మెమెంటోలు అందజేశారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

శిక్షా సప్తాహ్‌లో భాగంగా మొక్కలు నాటిన ఎంఈఓలు



ధర్మవరంలో మొక్కలు నాటుతున్న ఎంఈఓ-2గోపాల్‌నాయక్ తదితరులు

ధర్మవరం, జూలై 27: ప్రతి ఒక్కరు ఇంటి వద్ద మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పలువురు పేర్కొన్నారు. ఇన్నర్‌వీల్, రోటరీ క్లబ్, ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఎంఈఓ-2 గోపాల్‌నాయక్ చేతులమీదుగా మొక్కలు పంపిణీచేయించారు. ప్రధానంగా కేతిరెడ్డి, ఇందిరమ్మ, వైఎస్ఆర్ కాలనీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఐదువేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

కొత్తచెరువు: విద్యావారోత్సవాలలో భాగంగా 6వ రోజు మండల కేంద్రంలోని గాంధీనగర్ పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు వారి ఇళ్ల వద్ద పెంచుకోవ డానికి మొక్కలను పంపిణీచేశారు. ఎంఈఓ-2 జయచంద్ర, ఏడీ-2 రామక్రిష్ణ, ఉపాధ్యాయుడు మనోహర్ పాల్గొన్నారు.



కొత్తచెరువులో విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కదిరిఅర్బన్: మున్సిపాలిటీ పరిధి లోని కుటాగుళ్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా శనివారం పాఠశాల ఆవరణంతో పాటు, విద్యార్థుల ఇళ్ల వద్ద, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. ఎంఈఓ చెన్నక్రిష్ణ, ఎంఈఓ -2 ఓబులరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండలంలోని వివిధ పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా ఎంఈఓ తిరుపాల్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు.

నల్లమాడ: మండలంలోని గోపపల్లి ఎంపీయూపీ పాఠశాల, కేజీబీవీ లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరామిరెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ రమాదేవి తదితరుల పాల్గొన్నారు.



కుటాగుళ్లలో మొక్క నాటుతున్న దృశ్యం



నల్లచెరువులో...



గోపేపల్లి పాఠశాలలో...

భక్తి శ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



వ్రతంలో పాల్గొన్న మహిళలు

ధర్మవరం, జూలై 27: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో మూడో శనివారం ఏడు శనివారాల వ్రతాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రాజేశ్ స్వామి మూల విరాట్టును పట్టువస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం మహిళల చేత ఏడు శనివారాల వ్రతం చేయించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీశ్వర ప్రసాద్, ప్రధానకార్యదర్శి జింకా రాజేంద్ర ప్రసాద్, సభ్యులు చెన్నంశెట్టి శ్రీనివాసులు, చెన్నంశెట్టి రమేశ్ పాల్గొన్నారు.

ఖాద్రీశుడిని దర్శించుకున్న ఏడీజే



ఏడీజేకి ఖాద్రీశుడి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

కదిరి లీగల్, జూలై 27: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కదిరిలో వెలసిన నరసింహ స్వామిని జిల్లా అడిషన్ కోర్టు న్యాయాధికారి సత్యవాణి శనివారం దర్శించుకున్నారు. ఏడీజే వెంట స్థానిక న్యాయాధికారులు ఎస్ ప్రతిమ, పీ మీనాక్షి సుందరి ఇతర సిబ్బంది ఆలయానికి వచ్చారు. వారికి తూర్పు రాజగోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయాధికారులు స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ విశిష్టత వివరించారు. ప్రత్యేక పూజలు చేసి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన వైదేహీ ఆస్పత్రి వారు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏడీజేను స్థానిక న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి సన్మానించారు. స్థానిక కోర్టుల తనిఖీల్లో భాగంగా కదిరికి వచ్చినట్లు ఏడీజే పేర్కొన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కను నాటారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న న్యాయాధికారులు

నల్లచెరువు, జూలై 27: ప్రసిద్ధి చెందిన మండలపరిధిలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామిని శనివారం జిల్లా మొదటి అడిషనల్ కోర్టు న్యాయాధికారి సత్యవాణి, కదిరి సివిల్ కోర్టు న్యాయాధికారి ప్రతిమ, అడిషనల్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మీనాక్షి సుందర్ దర్శించుకున్నారు. న్యాయాధికారులకు ఆలయ ఈఓ రవీంద్రరాజు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందించారు. దుశ్శాలువలతో సత్కరించి, ఆంజనేయస్వామి చిత్రపటాలను బహూకరించారు. ఆలయ విశిష్టతను వివరించారు. న్యాయాధికారులతో పాటు పలువురు న్యాయవాదులున్నారు.

సబ్ జూనియర్స్ జిల్లా షూటింగ్‌బాల్ జట్టు ఎంపిక

ధర్మవరం, జూలై 27: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ షూటింగ్‌బాల్ పోటీల్లో సత్యసాయి జిల్లా సబ్‌జూనియర్ షూటింగ్ బాల్ జట్టు ఎంపికైనట్లు షూటింగ్ బాల్ అసోషియేషన్ జిల్లా ఇన్‌చార్జ్ ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఈ పోటీల్లో హిందూపురం ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, అంబేడ్కర్‌గురుకుల బాలికల పాఠశాల, ధర్మవరం పట్టణంలోని జీవన్‌జ్యోతిపాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కాకతీయ ఇంగ్లీషు మీడియం, వంశీకృష్ణ ఇంగ్లీషు మీడియం, పెనుకొండలోని ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశామన్నారు. వీరు ఆగస్టు 11, 12వ తేదీల లో చిత్తూరు జిల్లా కుప్పంలోజరిగే అంతర్ జిల్లా చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు నాగేంద్ర, మల్లికార్జున, రేణుక, రూప, గణేశ్, రాజేశ్, జిల్లా షూటింగ్ బాల్ అసోషియేషన్ సభ్యులు షెక్షావలి, నాగేంద్ర, బడిమల మోహన్ పాల్గొన్నారు.

అధికారుల నివేదికలతో ముగిసిన సమావేశం

ధర్మవరం రూరల్, జూలై 27: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ గిరకరమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుతం నూతన ప్రభుత్వంలో చేపట్టబోయే పథకాలను వివరించారు. త్వరలోనే రైతులకు అన్నదాతసుఖీభవ, వైద్యశాఖలో చేపడుతున్న వివరాలు, పంచాయితీరాజ్‌లో తాగునీటి సమస్య పరిష్కారం, సీసీరోడ్లు ఏర్పాటు తో పాటు ఇతర శాఖల అధికారులు నివేదికలతోనే సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అడిగిన ప్రశ్నకు ఏఈఓ అశ్విని సమాధానమిస్తూ త్వరలోనే రైతులకు ఈ పథకం విధివిధానాలు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ అబ్దుల్‌నబీ, డాక్టర్ పుష్పలత, ఏపీఓ అనిల్‌కుమార్‌రెడ్డి, ఏపీఎం రఘునాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగల అభివృద్ధికి కృషి

ఏపీ సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్

పుట్టపర్తి రూరల్, జూలై 27 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాదిగలను ఏకతాటిపైకి తెచ్చి, వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వ నాథ్ పేర్కొన్నారు. ఆయన శనివారం జిల్లాకేంద్రంలోని సాయి ఆరామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని ఎన్డీయేకూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ నాయకత్వం పటిష్టం చేయడం, త్వరలో జిల్లా కమిటీని ఏర్పాటు చేయడానికి ఈ సమావేశం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పలకల అంజనేయులు, మాతంగి తిప్పన్న, నరసింహులు, వెంకట్రాముడు, రంగప్ప, సాయిప్రసాద్, రమణ, చంద్ర, గంగులప్ప, జిల్లాలోని దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సమస్యలపై ఆరాతీస్తున్న మంత్రి సవిత

హాస్టల్‌లో సౌకర్యాలపై మంత్రి ఆరా

పెనుకొండ టౌన్, జూలై 27 : పట్టణంలోని ఎంజేపీ(మహాత్మాజ్యోతిబా పూలే) పాఠశాలను మంత్రి సవిత శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె హాస్టళ్లలో సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక నాయకులతో కలిసి పాఠశాలలోని మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యం తదితర వాటిపై ఆరాతీశారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని పరిష్కరిస్తామని విద్యార్థులకు సూచించారు. ఆమె వెంట పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అనుకూలంగా టీటీడీ కల్యాణమండపం

నిరుపేదలు వివాహాలు చేసుకునేందుకు అనుకూలంగా ఉన్న టీటీడీ కల్యాణమండపాన్ని తీర్చి దిద్దుతామని మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం స్థానిక నాయకులతో కలిసి టీటీడీ కల్యాణమండపాన్ని ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గ ప్రజలు వివాహాలు చేసుకోవాలంటే కళ్యాణమండపానికి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం టీటీడీ కళ్యాణమండపంలో అనుకూల సౌకర్యాలు ఉన్నాయని మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు టీటీడీ బోర్డు సభ్యులతో మాట్లాడతానన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ

పెనుకొండ రూరల్ : మండలంలోని అమ్మవారిపల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ డీలర్ భాస్కర్‌రెడ్డి తండ్రి రామిరెడ్డి(70) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత అమ్మవారిపల్లి చేరుకుని భాస్కర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఆమె వెంట మండల కన్వీనర్ శ్రీరాములు, మాజీ ఎంపీపీ కేశవయ్య, మాజీ సర్పంచ్ గుట్టూరు సూర్యనారాయణ, మాధవనాయుడు, మునిమడుగు వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు. హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి కుమారుడు సాయికళ్యాణ్ గ్రామానికి చేరుకుని రామిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఈయన వెంట మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, కన్వీనర్ సిద్దయ్య, గుట్టూరు నాగరాజు, వీజీపాళ్యం శీన, రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : డీఈఓ



నవోదయలో మొక్కలు నాటుతున్న అధికారులు

లేపాక్షి, జూలై 27 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్ష సప్తాహ కార్యక్రమం శనివారం స్థానిక జవహర్ నవోదయ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ మీనాక్షి హాజరయ్యారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణంలో అమ్మపేరుతో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఆమె విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మొక్కలునాటి వాటిసంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజునాయక్, నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏఈని నియమించండి



అగళి విద్యుత్ సబ్‌స్టేషన్

అగళి, జూలై 27 : మండల విద్యుత్ శాఖలో ఏఈ లేక పర్యవేక్షణ కొరవడుతోందని, తక్షణమే ఆ పోస్టును భర్తీ చేయాలని వినియోగదారులు, రైతులు కోరుతున్నారు. గతంలో ఎలక్ట్రికల్ ఏఈగా పనిచేసిన శ్రీనివాసరావుచౌదరి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దాదాపు సంవత్సర కాలంగా ఏఈ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇన్‌చార్జీలను నియమించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. రెగ్యులర్ ఏఈని నియమించాలని పలు మార్లు అధికారులకు విన్నవించామని అయినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. అధికారులు ట్రాన్స్‌కో ఏఈతోపాటు లైన్‌మ్యాన్, ఒక ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మానసిక రోగుల్లో మార్పు తేవాలి

● జిల్లా అదనపు న్యాయాధికారి శైలజ



రోగులకు పండ్లు అందజేస్తున్న ఏడీజే కంపల్లె శైలజ

హిందూపురం, జూలై 27 : మానసిక రోగుల్లో మార్పు తీసుకొచ్చే విధంగా వైద్యులు ప్రయత్నించాలని జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో మానసిక సమస్యలు రుగ్మతులపై న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయాధికారి పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ మాదక ద్రవ్యాల కారణంగా యువత మానసిక వ్యాధులకు గురవుతున్నారన్నారు. అలాంటి వారిలో వైద్యులు మార్పు తీసుకురావాలన్నారు. కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రోహిల్, వైద్యులు రాజగోపాల్, సోమశేఖర్, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, న్యాయవాదులు సుదర్శన్, కళావతి, పార్వతి, నవేరా, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరులో హైటెన్షన్

● ఏఎస్పీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు
● పట్టణమంతా ఖాకీ నీడలోనే ● టీడీపీ, వైసీపీ తలపడతాయని ముందస్తు సమాచారం
● సమావేశం వాయిదాతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు



బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ విష్ణు

హిందూపురం, జూలై 27 : చిలమత్తూరు మండలంలో గత వారం రోజులుగా మండల సర్వసభ్య సమావేశాలపైనే ఇరుపార్టీల నాయకుల మధ్య చర్చ జోరుగా సాగింది. ఈనెల 25న మండల సర్వసభ్య సమావేశం కోరంలేక వాయిదాపడగా శనివారం సభ్యులెవరూ రాకపోవడమే కాక పలువురు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. అయితే దేశం, వైసీపీ వర్గాల మధ్య గొడవ జరగవచ్చన్న ముందస్తు సమాచారంతో శనివారం మధ్యాహ్నం వరకు చిలమత్తూరులో హైటెన్షన్ నెలకొంది. జిల్లాకు నూతనంగా ఎస్పీ రావడంతో ఏదైనా సమస్య జరిగితే ఇబ్బందని భావించి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు ఏకంగా అదనపు ఎస్పీ విష్ణు ఆధ్వర్యంలో ముగ్గురు డీఎస్పీలు ఆరు మంది సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలతోపోలీసులు బందోబస్తు నిర్వహించారు. చిలమత్తూరు మండల కేంద్రంలో ప్రధాన రహదారులతోపాటు ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ పోలీసులు అడుగడుగునా గస్తీ నిర్వహించారు. ఉదయం 7గంటలకే చిలమత్తూరుకు చేరుకున్న ఏఎస్పీ విష్ణు, డీఎస్పీ కంజక్షన్, శ్రీనివాసులు, పర్యవేక్షణలో పోలీసులు చిలమత్తూరు మండల కేంద్రంలోకి పర్యవేక్షించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వైసీపీ కార్యకర్తలు కొంత మంది టీడీపీ నాయకులను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. ఈ నేపథ్యంలో జరగరానిది జరిగితే ఇబ్బందవుతుందని భావించి పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. కానీ అధికారులు తప్ప ఎంపీటీసీ సభ్యులు ఎవ్వరూ హాజరు కాకపోవడంతో అరగంట తర్వాత వాయిదా వేశారు. ఆ తరువాత ఐదు మంది ఎంపీటీసీలు, ఒక కోఆప్షన్ మెంబర్, సర్పంచ్ టీడీపీలో చేరడంతో జడ్పీటీసీ అనూషతోపాటు తొమ్మిది మంది టీడీపీ ఎంపీటీసీ నాయకులు కార్యాలయం వద్దకు చేరుకుని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

రెండోసారి వాయిదా

● హాజరుకాని ఎంపీపీ, ఎంపీటీసీలు..

వైసీపీకి షాకిస్తూ పలువురు టీడీపీలో చేరిక



వాయిదా తీర్మానాన్ని ప్రకటిస్తున్న ఎంపీడీఓ రాంకుమార్

చిలమత్తూరు, జూలై 27: చిలమత్తూరు మండల సర్వసభ్య సమావేశం రెండోసారి కూడా వాయిదా పడింది. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ, సభ్యులు ఎవ్వరూ హాజరుకాకపోవడంతో సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ రామ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 24న జరిగిన జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీతో పాటు సభ్యులు ఎవ్వరూ హాజరుకాలేదు. దీంతో 27వ తేదీకి వాయిదా వేశారు. మూడు నెలల కాలంలో సమావేశం నిర్వహించేందుకు నివేదిక పంపుతామన్నారు.

భారీగా పోలీస్ బందోబస్తు

సర్వసభ్య సమావేశం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ నెల 24న సమావేశానికి ఎవ్వరూ రానీయకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారని ఎంపీపీ పురుషోత్తంరెడ్డితో పాటు పలువురు ఎంపీటీసీలు ఏఎస్పీకి విన్నవించారు. దాంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఏఎస్పీ విష్ణు సభ జరిగే పరిసరాల్లో బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. ముగ్గురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో పాటు స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైసీపీకి షాక్

మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. సర్వసభ్య సమావేశం వాయిదా పడిన తక్షణమే ఏడుగురు ఎంపీటీసీలతో పాటు సర్పంచ్, సింగిల్ విండో అధ్యక్షుడు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గత వారం రోజులుగా జరుగుతున్న రాజకీయ నాటకీయ పరిణామాలలో చివరికి వైసీపీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆ పార్టీపై తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తూ టీడీపీలోకి చేరిపోయారు. మండల కన్వీనర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ ఎంపీటీసీలు కోడూరు 1,2,3 - అంజలీదేవి, ఆదినారాయణప్ప, మంజునాథరెడ్డి, టేకులోడు ఎంపీటీసీ కవిత, చిలమత్తూరు ఎంపీటీసీ కవిత, కొడికొండ ఎంపీటీసీ ఇర్షాద్‌బేగం, కోఆప్షన్ సభ్యులు ఖాసీం ఖాన్, కోడూరు సర్పంచ్ మురళీమోహన్, కోడూరు సింగిల్ విండో అధ్యక్షులు హనుమంతరెడ్డిలు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా రంగా రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికే టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అనూష, టీడీపీ నాయకులు నాగరాజుయాదవ్, దేమకేతేపల్లి అంజినప్ప, బేకరీ గంగాధర్, బాలాజీ, తిప్పారెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, సోమశేఖర్, నందీషప్ప, గౌరీశంకర్, అశ్వత్థప్ప, శ్రీదేవి, బాబురెడ్డి తదితరులు ఉన్నారు.

ఖైదీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

● జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మి



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి రాజ్యలక్ష్మి

హిందూపురం, జూలై 27 : జైలులో ఖైదీలకు మెరుగైన సౌకర్యం కల్పించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మీ ఆదేశించారు. శనివారం సబ్‌జైలును తనిఖీచేశారు. ఈ సందర్భంగా జైలులో ఎంతమంది ఖైదీలున్నారు, ఏఏ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్నారు అనే విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ క్షణికావేశాల్లో చేసిన తప్పులకు జైలుపాలైతే కుటుంబ సభ్యులు సమాజంలో తలెత్తుకోకుండా ఇబ్బందులు పడతారన్నారు.. ఖైదీలకు భోజనంతోపాటు ఇతర సౌకర్యాలు అందించాలని జైలు అధికారి అంజేనాయక్‌కు ఆదేశించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సరిహద్దులో శాంతిభద్రతలు కాపాడాలి

● గోరంట్ల స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ రత్న



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ వి. రత్న

గోరంట్ల, జూలై 27: శ్రీసత్యసాయి జిల్లా, కర్ణాటక సరిహద్దు ప్రాంతానికి సమీపంలో ఉన్నందున ఆ రాష్ట్ర పోలీసుల సహకారంతో శాంతిభద్రతలు కాపాడాలని ఎస్పీ వి. రత్న సిబ్బందికి సూచించారు. గోరంట్ల పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ శనివారం తనిఖీ చేశారు. అనంతరం క్రైమ్ రిజిష్టర్ పరిశీలించి, పెడింగ్, కోర్టు కేసులపై ఆరా తీశారు. స్టేషన్‌లో సిబ్బంది, ఎస్ఐల కొరత తదితర సమస్యలపై పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సయ్యదతో చర్చించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఐలు లేకపోవడంతో అక్రమ రవాణా, భూసమస్యలు, సరిహద్దు నేరాలు, రోడ్డు ప్రమాదాలు, చోరీలు అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. మహిళలు, బాలికలు అదృశ్యమైన సంఘటనలు అధికంగా ఉన్నాయన్నారు. సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ ధనుంజయరెడ్డి, మద్దిలేటి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం : మంత్రి



అబ్దుల్ కలాంకు నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 27 : భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్‌కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని బీసీ, చేనేత జౌళిశాఖమంత్రి సవిత కొనియాడారు. అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా పెనుకొండ ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కేశవయ్య, దాదు, అశ్వర్థప్ప, బాబుల్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, జాఫర్, సిద్దయ్య, శ్రీరాములు, రామలింగ, రవి, చంద్రకాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● మ్యాన్ ఆఫ్ మిస్సైల్, భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం 9వ వర్ధంతిని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. అబ్దుల్‌కలాం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు వద్ద కళా విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత డీఎస్పీ బాబిజాన్‌సైద హాజరై కలాం విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ సభ్యుడు సమీవుల్లా, రిటైర్డ్ ఎంఈఓ శ్రీరాములు, పరిరక్షణ కమిటీ సభ్యులు జాఫర్‌వలి, భాషా, కన్నా, ఎమ్మార్పీఎస్ సభ్యులు రామాంజినేయులు, ఎంఎస్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు ఆఫీస్, శంకర్‌నాయక్, శ్రీలేఖ, అధ్యాపకులు మూర్తి, బోధన సిబ్బంది బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డుల తారుమారుపై ఆర్డీఓ విచారణ

గోరంట్ల, జూలై 27: మండలంలోని గుంటిపల్లికి చెందిన ప్రభుత్వ పాఠశాల స్థలం, పలువురు రైతులకు చెందిన దాదాపు 11.23 ఎరాలకు మరోకరి పేరున వన్‌బీ మార్పు చేసిన సంఘటనపై ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఓడీసీ మండలంలోని కుసుమవారిపల్లికి చెందిన కొండే ఈశ్వర్‌రెడ్డి పేరున పాఠశాల స్థలంతోపాటు, పలువురు రైతులకు చెందిన భూములను ఇటీవల ఆన్‌లైన్‌లోమార్పు చేశారు. దీనికి నిరసనగా సంబంధిత రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. వివాదంపై స్పందించిన జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ విచారణ చేపట్టాలని ధర్మవరం ఆర్డీఓను ఆదేశించారు. దీంతో ఆర్డీవో శనివారం తహసీల్దార్ అక్బల్‌బాషా, ఆర్ఐ సోముశేఖర్‌రెడ్డి, సంబంధిత వీఆర్ఓలు సురేష్, పెద్దన్నలతో విచారించి, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మండలసర్వేయర్ తాతయ్య, సంబంధిత రెవిన్యూ అధికారులతో కలిసి గుంటిపల్లి గ్రామానికెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి అక్కడే బాధిత రైతులు, గ్రామస్థులతో సమావేశమయ్యారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన సర్వేనెం. 510-2 బీలో 1.16ఎకరాలు పాఠశాలకు కేటాయించినట్లు చెప్పగా, రికార్డుల పరంగా 1.13ఎకరాలుందన్నారు. భూసేకరణ ద్వారా 1998లో పాఠశాల స్థలాన్ని ప్రభుత్వం సేకరించినా, రికార్డు పరంగా ప్రభుత్వ స్థలంగా పేర్కొన్నలేదన్నారు. ఈవిషయంపై పాఠశాల స్థలం అన్యాక్రాంతమవుతుండడతో కొలతలు వేసి మ్యాప్ తయారు చేయాలని సర్వేయర్‌ను ఆదేశించామన్నారు. వన్‌బీ మార్పు చేయించుకువారి భూ రికార్డులు పరిశీలించిన తరువాత సంపూర్ణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఆయనతోపాటు పుట్టపర్తి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శేఖర్, డిటీ రెడ్డిశేఖర్, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

నరసింహస్వామికి ఏకాదశి పూజలు

మడకశిర(అమరాపురం), జూలై 27: అమరాపురం మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి మహామంగళ హారతి నిర్వహించారు. ఆలయం నుంచి కలశాలతో గౌడనకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న మూలవిరాట్ విగ్రహం వద్దకు స్వామివారిని కలశాలతో ఊరేగింపుగా డప్పు వాయిద్యాలతో తీసుకొనివచ్చి కూర్చొబెట్టారు. భక్తులకు మహామంగళ హారతి, తీర్థప్రసాదాలు అందజేశారు.

పేట ఆలయంలో ప్రాకారోత్సవం

హిందూపురం అర్బన్, జూలై 27: పట్టణ పరిధిలోని ప్రసిద్ధ పేట వేంకటేశ్వర దేవాలయంలో ఆషాఢమాసం శనివారంను పురస్కరించుకొని ప్రాకారోత్సవం నిర్వహించారు. తెల్లవారు మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు అర్చనలు నిర్వహించి పూలు, నగలు, తులసీ దళాలతో శ్రీవారిని అందంగా ముస్తాబు చేశారు. భజనలు, కీర్తనలతో ఆలయ ప్రాంగణం దద్దరిల్లింది. గోవిందనామ స్మరణ చేస్తూ ప్రాకారోత్సవం చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు కలియుగ వైకుంఠవాసున్ని దర్శించి పరవశించారు.

ఉపాధ్యాయుడి అదృశ్యంపై కేసు నమోదు

గోరంట్ల, జూలై 27: పట్టణంలోని నవోదయ కోచింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయుడు బాబా ఫకృద్దీన్ ఈనెల 23న అదృశ్యవడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. గోరంట్లలోని మూలబావి వీధిలో ఉంటున్న బాబా ఫకృద్దీన్ స్థానిక నవోదయ కోచింగ్ సెంటర్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. 23న సాయంత్రం 5.30గంటల సమయంలో కోచింగ్ సెంటర్‌వద్దకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్లు గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో భార్య రిజ్వాన్‌కేసర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా మొహరం వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 27 : మండల కేంద్రంలో శనివారం మొహరం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కాలమ్మ ఆలయం వద్ద ఉన్న చావిడిలో కొలువుదీరిన పీర్లకు భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం అగ్నిహోమం వద్ద అలావు ఏర్పాటు చేశారు. పీర్లను పురవీధుల్లో ఊరేగించారు. పానకం పంపిణీ చేశారు. టీడీపీ టౌన్ కన్వీనర్ సూరీ మాట్లాడుతూ ఆదివారం సమీప చెరువులో జలధి వేడుకలను నిర్వహిస్తామన్నారు. భక్తులు అశేష సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

ఉచితంగా పొద్దుతిరుగుడు విత్తనాలు

గుడిబండ, జూలై 27 : మండలంలోని రైతులకు ప్రభుత్వం ఉచితంగా పొద్దుతిరుగుడు విత్తనాలను అందించనున్నట్లు ఏఓ వీరనరేష్ తెలిపారు. ఒక్కో రైతుకు రెండు కిలోల పొద్దుతిరుగుడు విత్తనాలను అందిస్తామన్నారు. ఆసక్తికలిగిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, 1బీ, ఆధార్ జిరాక్స్‌లతో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. తీసుకెళ్లిన రైతులు తప్పనిసరిగా సాగుచేయాలని , ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు

నివాస గృహాలను తొలగించాలని బెదిరింపులు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

గోరంట్ల, జూలై 27: మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలో ప్రభుత్వ స్థలంలో నివాసముంటున్న పేదల ఇళ్లు తొలగించాలని కొంతమంది బెదిరిస్తున్నారని, బాధితులు గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో సీఐ సుబ్బరాయుడుకి శనివారం ఫిర్యాదు చేశారు. పాలసముద్రం క్రాస్‌లోని ప్రభుత్వ స్థలంలో కొన్ని నెలలక్రితం కార్మిక సంఘాల మద్దతుతో పలువురు పేదలు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతుండగా, పాలసముద్రం గ్రామానికి చెందిన కొందరు బెదిరిస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి పెద్దన్న, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు హనుమంతు, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కదిరప్ప, వారికి అండగా నిలిచారు. నాగమణి ఇంటి గోడలను తొలగించారని,మిగిలిన ఇళ్లను రెండురోజులతో తొలగించకపోతే యంత్రాలతో తొలగిస్తామని హెచ్చరించినట్లు ఫిర్యాదు చేశారు. అనంతరం గుమ్మయ్యగారిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద బైటాయించారు. తమ నివాసాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆందోళన చేశారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు కార్మిక సంఘం నాయకులు, నివాస గృహలవారున్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ



విద్యాసామగ్రిని అందజేస్తున్న ఎంఈఓ ఆంజనేయులు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 27 : మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో ఎంపీయూపీఎస్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు దాతలు నోటుపుస్తకాలు, పెన్నులు, వాటర్‌బాటిళ్లు, పెన్సిళ్లు, జామెంట్రి బాక్సులను ఎంఈఓ ఆంజనేయులు చేతులమీదుగా అందజేశారు. గ్రామానికి చెందిన జీఎంవీ శాంతమ్మ, జ్ఞాపకార్థం ఆమె కుమారులు మురళి, సత్యనారాయణలు యేటా విద్యాసామాగ్రి అందజేయడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల అభివృద్ధికి పాటుపడుతున్న దాతలను అభినందించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో బీజేవీపెస్ అందించిన మొక్కలను వారు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హనుమంతరాయుడు, అధ్యాపకులు చంద్ర, గణేష్, విజయలక్ష్మి, మూర్తి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఏక్ మాకి ఏక్ పేడ్ కార్యక్రమం

హిందూపురం(పరిగి), జూలై 27 : శిక్ష సప్తాహ ఆరో రోజు కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు దేశంలోని ప్రతి పాఠశాలలో 'ఏక్‌మాకి ఏక్‌పేడ్ కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా టీడీపీ నాయకులు, పాఠశాలల్లో నిర్వహించారు. విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రాథమిక ఉన్నత పాఠశాల, పరిగి, సేవామందిరం, ధనాపురం, ఊటకూరు, శాసనకోట పాఠశాలలను సందర్శించి మొక్కలను నాటారు. ఈ మొక్కలను విద్యార్థులే సంరక్షించుకునే విధంగా ప్రతి మొక్కకు తల్లిపేరే పెట్టి పిల్లలకు దత్తత ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 శేషాచలం, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మారుతి, వడ్డెర సాధికార రాష్ట్ర మెంబర్ హనుమయ్య, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి, శీన, నరసింహప్ప, రంగనాథ్, చౌడప్ప, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో శిశువు కిడ్నాప్‌నకు యత్నం

● గుర్తించి అడ్డుకున్న మహిళలు, నర్సులు ● పోలీసుల అదుపులో నిందితుడు

హిందూపురం అర్బన్, జూలై 27: హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం రాత్రి 7 గంటల సమయంలో ఓ శిశువు కిడ్నాప్ యత్నం జరిగింది. పరిగి మండలం జంగాలపల్లికి చెందిన సౌజన్య శనివారం ఉదయం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చారు. లేపాక్షి మండలం మైదుగోళం గ్రామానికి చెందిన మహ్మద్ ఇలియాజ్ అనే వ్యక్తి వచ్చి ఆ బిడ్డను ఎత్తుకున్నాడు. బిడ్డ అందంగా ఉండటంతో ముద్దు చేస్తున్నాడని భావించిన శిశువు నాన్నమ్మ.. చూస్తూ ఉండిపోయింది. కాసేపటికి ఆమె కళ్లుగప్పి బిడ్డను ఎత్తుకుని బయటికి వెళ్లడానికి ప్రయత్నించారు. గమనించిన అక్కడున్నవారు నిలదీయడంతో తన బిడ్డే అని బుకాయించాడు. పాప నుదుట బొట్టు ఉండటం, ఎత్తుకున్న వ్యక్తి ముస్లిం కావడంతో అక్కడున్న మహిళలు, నర్సులు వెంటనే కాన్పుల వార్డు తలుపులు వేసి ప్రతిఘటించారు. బిడ్డను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాడని కేకలు వేయడంతో సెక్యూరిటీ సిబ్బంది వచ్చి అదన్ని నిర్బంధించారు. విషయం తెలుసుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్.. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మహ్మద్ ఇలియాజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. రెండు రోజుల క్రితం ఇలియాజ్ భార్య షేక్ నిస్సా అదే బెడ్‌పై కాన్పు అయిందని పోలీసులకు తెలిపారు. అతనికి, అతని భార్యకు మాటలు లేవని, బిడ్డ పుట్టిందని తెలుసుకొని చూడటానికి వచ్చాడని తమతో అంటున్నాడని పోలీసులు తెలిపారు. హిందూపురం మోడల్ కాలనీలోని ఇలియాజ్ భార్య ఇంటికి వెళ్ళి విచారించారు. బిడ్డ పుట్టింది నిజమే అని నిర్ధారించుకున్నారు. కానీ, బెడ్‌మీద భార్య లేకపోయినా, హిందువుల బిడ్డను ఎత్తుకుపోవడం అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. కాగా, మూడు రోజుల క్రితం కాన్పుల వార్డువద్ద అనుమానాస్పద వ్యక్తి సంచరించాడు. రాత్రి కావడంతో సెక్యూరిటీ సిబ్బంది నిలదీయడంతో అక్కడి నుంచి జారుకున్నాడు.



ఆస్పత్రిలో పసికందు



బిడ్డ తల్లి సౌజన్య



బిడ్డను ఎత్తుకెళ్లేందుకు యత్నించిన ఇలియాజ్